పాఠశాల ఆవరణలో ఇసుక డంప్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం

- ఇంజనీరింగ్ అధికారులకు నోటీసులు ఇవ్వాలని కమిషనర్‌కు సబిత ఆదేశం

సరూర్‌నగర్, మే 3(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఇసుకతో పాటు ఇతర మెటీరియల్ డంప్ చేయడంపై మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలు, ఉపాధ్యాయులు తిరిగే ప్రదేశంలో ఇసుక, కంకర వంటి మెటీరియల్ డంప్ చేస్తారా? అని ఆమె అధికారులను ప్రశ్నించారు. దీనిపై మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఆమె మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో చెరువుల సుందరీకరణ, ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణం తదితర అంశాలపై శనివారం మునిసిపల్ కార్యాలయంలో ఇరిగేషన్, హెచ్ఎండీయే, మునిసిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాపూర్ పాఠశాలలో ఇసుక, కంకర డంప్ చేసిన అంశంపై ఆమె తీవ్రంగా స్పందించారు. వెంటనే వాటిని అక్కడి నుంచి తొలగింపజేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులకు నోటీసులు జారీ చేసి వివరణ కోరాలని ఆదేశించారు.

ఎస్ఎన్‌డీపీ నాలా సమస్యను పరిష్కరిస్తాం

బడంగ్‌పేట్-నాదర్‌గుల్ రోడ్డులో పీఎంఆర్ గార్డెన్స్ వద్ద వివాదస్పదంగా మారి అసంపూర్తిగా మిగిలిన ఎస్ఎన్‌డీపీ నాలా సమస్యను త్వరలో పరిష్కరింపజేస్తానని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. కొందరు దళిత రైతులకు, గార్డెన్స్ యజమానులకు మధ్య ఈ అంశం వివాదస్పదం కావడంతో శనివారం ఆమె వారితో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు.

మంత్రాలచెరువులో పూడిక తీయాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి శనివారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మంత్రాలచెరువును సందర్శించి అక్కడ జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించి, ఆ వెంటనే పూడికతీత పనులు సైతం చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో మునిసిపల్ కమిషనర్లు సరస్వతి, ఆర్.జ్ఞానేశ్వర్, ఏఎంసీ శ్యాం సుందర్, బాలాపూర్ డీటీ మణిపాల్‌రెడ్డి, మునిసిపల్ డీఈఈ వెంకన్న, ఏఈఈ వినీల్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.



మంత్రాలచెరువును పరిశీలిస్తున్న సబితారెడ్డి



ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, మే 3(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్‌కాటన్‌శారీస్, లేడీస్‌ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్, లక్నో చికెన్, బనారస్‌శారీస్, ఖాదీమెటీరియల్, వన్‌గ్రామ్‌గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్, ఇతరఅనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30ల నుంచి రాత్రి 9గంటల వరకు కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని అక్బర్‌అలీ పేర్కొన్నారు.

టీయూడబ్ల్యూజే ప్రభుత్వానికో, పార్టీకో గొంతుక కాదు

- రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ

ఎల్‌బీనగర్, మే 3(ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే సంఘం ప్రభుత్వానికో లేక పార్టీలకో గొంతుకగా నిలవదని జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే పరమావధిగా పోరాడుతుందని రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ స్పష్టం చేశారు. టీయూడబ్ల్యూజే-ఐజేయూ రంగారెడ్డి జిల్లా యూనియన్ మొదటి కార్యవర్గ సమావేశం శనివారం జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీంపాషా అధ్యక్షతన ఎల్బీనగర్‌లోని మార్కెటింగ్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం భవనంలో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డితో కలిసి విరాహత్‌అలీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతూ వారి సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేస్తున్న ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే అని అన్నారు. జిల్లా కమిటీలే సంఘానికి పునాదులని అన్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు చురుగ్గా ఉంటూ సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు.



జర్నలిస్టుకు ఇన్సూరెన్స్ పత్రాన్ని అందజేస్తున్న విరాహత్‌అలీ, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు అక్రిడిటేషన్

అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు వస్తుందని విరాహత్‌అలీ చెప్పారు. ప్రభుత్వం జర్నలిస్టు పెద్దలతో ఒక కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ పలుదఫాలు సమావేశమై ప్రస్తుతమున్న జీఓలోని లోటుపాట్లను పరిశీలించి ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించిందన్నారు. త్వరలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణ, నాయకులు జాల రాధాకిషన్, తాటిపర్తి ప్రవీణ్‌కుమార్, మొగిలి నర్సింహారావు, శ్రీశైలం, శశిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.